
సాక్షి
రంగారెడ్డి
గురువారం : 16 : మే : 2024



భౌ భౌలతో.. బెంబేలు!

వీధికుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. వాహనదారులను వెంబడిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. 8లో ▸



ఓటరు తీర్పు..

లోక్‌సభ పోలింగ్ ముగిసింది. ఇక నాయకులు ఓటర్ల తీర్పుపై చర్చలు మొదలు పెట్టారు. 8లో ▸



మద్యం బాటిళ్ల ధ్వంసం

ఆమనగల్లు ఠాణా పరిధిలో పట్టుబడిన మద్యం బాటిళ్లను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో భారీ మోసం

సాక్షి, సిటీబ్యూరో: రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో భారీ మోసానికి పాల్పడిన ఓబిలీ హౌసింగ్ సంస్థ యజమాని సహా ఇద్దరిని సైబరాబాద్ ఈఓ డబ్ల్యూ అధికారులు అరెస్టు చేశారు. వీళ్లు 50 మంది బాధితుల నుంచి రూ.10 కోట్లకు పైగా వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ సంస్థ యజమాని పాపన్నగారి రామచంద్రారెడ్డి నగర శివార్లలోని వివిధ ప్రాంతాల్లో వెంచర్ల పేరుతో ప్రచారం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట కేంద్రంగా భారీ వెంచర్ వేసి ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో ప్లాట్లు విక్రయిస్తున్నారు. మేనేజింగ్ డైరెక్టర్ గుప్తాతో పాటు మార్కెటింగ్ ఏజెంట్ల 'హైవే ప్యారడైజ్' పేరుతో ప్లాట్లు అమ్మారు. వెంకటాపురం గ్రామంలో 200 ఎకరాల్లో వెంచర్ అభివృద్ధి చేస్తున్నామని, గరిష్ఠంగా మూడేళ్లల్లో ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని చెప్పి ప్లాట్ల విక్రయాలు చేశారు. వీరి మాటలు నమ్మిన అనేక మంది ఇన్వెస్టర్ల నుంచి డిపాజిట్లు కూడా సేకరించి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఈఓ డబ్ల్యూ అధికారులు రామచంద్రారెడ్డితో పాటు గుప్తాను అరెస్టు చేశారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

అనంతగిరి: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 16వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి రూపాయల అపరాధ రుసుంతో కళాశాలలో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎస్టీపీల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా నిర్మిస్తున్న రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్టీపీ)ను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి సందర్శించారు. అత్తాపూర్, మీరాలంలో నిర్మిస్తున్న ఎస్టీపీలతో పాటు..హసన్‌నగర్‌లోని ఐఅండ్‌డీ లను బుధవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ముందుగా అత్తాపూర్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన నిర్మాణ పనులు పరిశీలించి వేగవంతంగా చేయాలని ఆదేశించారు. అనివార్య కారణాల వల్ల పనులు ఆలస్యమైనప్పటికీ.. సకాలంలో పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం ఇటీవల పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మీరాలం ఎస్టీపీని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సమీప కాలనీల నుంచి చెరువులోకి మురుగు చేరే పాయింట్లను గుర్తించారు. ఈ మురుగు చెరువులో చేరకుండా, చెరువు చుట్టూ ఉన్న పైపు లైన్లను అనుసంధానం చేసి కొత్తగా నిర్మిస్తున్న ఎస్టీపీలోకి మళ్లించాలని ఆదేశించారు. పని జరిగే ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్-2, సీజీఎం సుదర్శన్, జీఎం, ఎస్టీపీల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగు సెగ్మెంట్లలో పురుషులదే ఆధిపత్యం

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల్లో పురుషులదే ఆధిపత్యం కన్పించింది. గ్రేటర్ పరిధిలోని చేవెళ్ల, మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలన్నింటిలోనూ అత్యధికంగా పురుషులే ఓటు హక్కు వినియోగించుకున్నారు. నమోదైన మొత్తం ఓట్లలో 51.83 శాతం పురుషులు, 48.81 శాతం మహిళలు ఓటేశారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 10,74,827 ఓట్లు పోలవ్వగా పురుషులు 5,62,498 మంది, మహిళలు 5,12,302 మంది ఉన్నారు. మల్కాజిగిరిలో 19,19,131 ఓట్లు పోలయ్యాయి. అందులో 9,95,791 మంది పురుషులు, 9,23,206 మంది మహిళల ఓట్లున్నాయి. చేవెళ్ల పరిధిలో మొత్తం 16,57,107 ఓట్లు పోలవ్వగా 8,53,237 మంది పురుషులు, 8,03,827 మంది మహిళా ఓటర్లు, సికింద్రాబాద్ నియోజకవర్గంలో 10,39,834 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 5,37,166 మంది పురుషులు, 5,02,636 మంది మహిళలు ఓటు వేశారు. మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్ నియోకవర్గాల్లో సుమారుగా 51 శాతంపైగా పురుషులు ఓటేయగా, 48శాతం మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ నియోజకవర్గంలో మాత్రం 52.33 శాతం పురుషులు, 47.66శాతం మహిళలు ఓటేశారు.


ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలు శాతంలో..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
హైదరాబాద్	52.33	47.66
సికింద్రాబాద్	51.65	48.33
మల్కాజ్‌గిరి	51.88	48.10
చేవెళ్ల	51.48	48.14

ప్లస్సా.. మైనస్సా..!

బూత్‌ల వారీగా అభ్యర్థుల లెక్కలు

- క్షేత్రస్థాయి కేడర్‌తో సమీక్షలు
- గెలుపుపై అభ్యర్థుల అంచనాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. పోలింగ్ సరళిపై అభ్యర్థులు క్షేత్రస్థాయి కేడర్‌తో అభ్యర్థులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఎవరి ఓటు ఎటు పడిందనే అంశంపై లెక్కలేస్తున్నారు. గెలుపుపై అభ్యర్థులు ఎవరికి వారు ధీమాగా ఉన్న అంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. ఓట్ల లెక్కింపునకు మరో 18 రోజులు గడువు ఉండడం.. ఆశించిన పోలింగ్ కేంద్రాల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదవ్వడంతో అభ్యర్థులకు కంటిమీద కునుకు కరువైంది. ఓటింగ్ ముగిసిన తొలిరోజు పూర్తిగా ఇంటికే పరిమితమైన అభ్యర్థులు.. తర్వాత రోజు నుంచి పోలింగ్ బూత్‌ల వారీగా చేసిన ఖర్చు.. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లు.. సర్వే సంస్థలు.. సొంత మనుషులు, పార్టీ కేడర్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కూడికలు.. తీసివేతలతో తలమునకలయ్యారు.

క్రాస్ ఓటింగ్‌పై ఆశలు

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో మొత్తం 29,38,370 ఓట్లకు కేవలం 16,57,107 ఓట్లే (56.40 శాతం) పోలయ్యాయి. వీటిలో ఐటీ ఉద్యోగులు, విద్యావంతులు ఎక్కువగా ఉన్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం ఓటర్లపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఆయా నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో పోలింగ్‌శాతం నమోదుకాకపోవడం బీజేపీ అభ్యర్థిని ఆందోళనకు గురిచేస్తోంది. వికారాబాద్, పరిగి, తాండూరు సహా చేవెళ్ల, మహేశ్వరం నియోజకవర్గాల్లోని ఓటర్లపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలోని శాస్త్రీపురం, సులేమాన్ నగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, మహేశ్వరం సెగ్మెంట్‌లోని జల్‌పల్లి, పహడీషరీఫ్, షాహీన్‌నగర్, బాలాపూర్ బూత్‌లలో నమోదైన ఓట్లశాతంపైనే ఆ పార్టీ విజయం ఆధారప డి ఉండటంతో ఆ దిశగా లెక్కలేసుకుంటున్నారు. బూత్‌ల వారీగా క్షేత్రస్థాయి కేడర్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా సర్వే చేయిస్తున్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెజార్టీ బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు డైవర్ట్ అయిన ట్లు చర్చ సాగుతోంది. ఆ దిశగా అభ్యర్థులు అంచనా వేసుకుంటున్నారు.

సిట్టింగ్‌లకు టెన్షన్

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్‌కు సిట్టింగ్ స్థానం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించిన పార్లమెంట్ నియోజకవర్గం. ఇక్కడ మొత్తం 37,79,596 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 19,19,131 మంది ఓటర్లు(50.78 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎల్బీ నగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నమోదైన ఓటింగ్ శాతంపై ఆరా తీస్తున్నారు. ఇక్కడ సెటిలర్లు ఎక్కువగా ఉండటం, ఓటింగ్ రోజు వీరంతా సొంతూళ్లకు వెళ్లిపోవడం అభ్యర్థుల్లో టెన్షన్‌కు కారణమవుతోంది. ఇక్కడ బీజేపీ అంచనాలకు మించి ఓట్లతో విజయం సాధించబోతున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు స్పష్టం చేస్తుండటం సైతం బరిలో ఉన్న అభ్యర్థితో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ఇక సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో 21,20,401 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 10,39,834 మంది(49.04 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, అంబర్‌పేటలోని ముస్లిం ఓటర్లు, సికింద్రాబాద్‌లోని క్రిస్టియన్ మైనార్టీ ఓటర్లు సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నిద్రలేకుండా చేస్తుంది. గెలుపుపై ఆయన ధీమాగా ఉండటం కొసమెరుపు. ఇక హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో 22,17,094 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 10,74,827(48.48శాతం) మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెజార్టీ ఓటర్లు ఎంఐఎం వైపు మొగ్గుచూపడంతో ఆ పార్టీ విజయం ఖాయమైనట్లు తెలుస్తోంది.



షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్'

- తొలి విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం
- జూలై 7నాటికి అడ్మిషన్లు పూర్తి.. 8 నుంచి తరగతులు

షాద్‌నగర్: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశాలు ఎన్ని ఉన్నా డిగ్రీ కోర్సులకే ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులు నేరుగా తమకు ఇష్టమైన కళాశాలలను ఎంచుకునేందుకు ప్రభుత్వం 2016 నుంచి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విడత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.

న్యాక్ బీప్లస్ గ్రేడ్

పాలమూరు వర్సిటీకి అనుబంధంగా పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అధునాతన వసతులతో విశాలమైన ఆవరణలో కళాశాలను నిర్మించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, తాగునీటి ప్లాంట్, సోలార్ ప్లాంట్, ఇంటర్నెట్ సదుపాయం, మరుగుదొడ్ల నిర్వాహణ, బొటానికల్ గార్డెన్, కంపోస్టు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ఇటీవల కళాశాలను సందర్శించిన న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం కళాశాలకు బీప్లస్ గ్రేడ్ కేటాయించింది.

కోర్సులు

- బీఏ ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన
- బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) ఇంగ్లిష్ మీడియం
- బీఎస్సీ(ఫిజికల్ సైన్స్)
- బీఎస్సీ (లైఫ్ సైన్స్)

మూడు దశల్లో సీట్ల కేటాయింపు

డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సీట్ల భర్తీకి ప్రభుత్వం ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. డిగ్రీ సీట్లను మూడు దశల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇంటర్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నెల 29వరకు తొలి దశ రిజిస్ట్రేషన్లు స్వీకరించనున్నారు. 20 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 6న తొలి దశ సీట్లను కేటాయించనున్నారు. జూన్ 6 నుంచి 13వరకు రెండవ దశ రిజిస్ట్రేషన్ జూన్ 6 నుంచి 14వరకు వెబ్ ఆప్షన్లు.. 18న సీట్లు కేటాయించనున్నారు. మూడవ దశ రిజిస్ట్రేషన్ జూన్ 19 నుంచి 24 వరకు, వెబ్ ఆప్షన్ జూన్ 19 నుండి 25 వరకు, సీట్లను జూన్ 29న కేటాయించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు తమ హాల్ టికెట్ నెంబర్‌తో దోస్త్ వెబ్ సైట్ https://dost.cgg.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.



కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్

సులభంగా రిజిస్ట్రేషన్

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ వెబ్‌సైట్‌లో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదంటే సమీపంలో ఉండే మీ సేవా కేంద్రాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ సెంటర్‌ను ఆశ్రయించాలి. విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాక దోస్త్ ఐడీ, పిన్ నెంబర్ వస్తుంది. వీటిని ఎవరికి చెప్పకుండా భద్రపర్చుకోవాలి. విద్యార్థులు సాధ్యమైనంత వరకు ఎక్కువ వెబ్ ఆప్షన్లు నమోదు చేయాలి. ఆప్షన్లకు ముందుగా ఏ కళాశాలల్లో ఏ కోర్సు ఉందో తెలుసుకోవచ్చు.

అధునాతన వసతులు



షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అధునాతన వసతులు కల్పించాం. సువిశాల వాతావరణం ఉన్న కళాశాలలో వివిధ రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కళాశాలకు న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ లభించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. – భాను ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, షాద్‌నగర్

ఉచిత సహాయ కేంద్రం



డిగ్రీలో ప్రవేశాలకు గాను దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు చేసుకోవచ్చు, లేదంటే కళాశాలలో సహాయ కేంద్రంలో సంప్రదించాలి.

– డాక్టర్ కమల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, షాద్‌నగర్

దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కుల్కచర్ల కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వెనుకబడిన వర్గాల విద్యార్థినులకు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులను పరిచయం చేస్తున్నామని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9550335857లో సంప్రదించాలని సూచించారు.

కారు కేడర్ పరేషాన్

లోక్‌సభ ఎన్నికల్లో చేతులెత్తేసిన బీఆర్‌ఎస్ నేతలు

- ఓటింగ్‌కు మూడు రోజుల ముందు నుంచే ప్రచారానికి దూరంగా..
- పోలింగ్ సరళిని పరిశీలించని వైనం
- కొన్ని చోట్ల బీజేపీకి అనుకూలంగా..
- తమ పార్టీని తామే బలహీన పరచుకున్నారనే చర్చ
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- ఇది వ్యూహాత్మక ఎత్తుగడా..? చారిత్రక తప్పిదమా..?



వికారాబాద్: తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతల తీరు ఆత్మహత్యా సదృశ్యంగా మారింది. ఈ ఎన్నికల్లో ఆద్యంతం వారి తీరు విమర్శలకు దారితీసింది. వారం రోజులు బాగా పని చేసినట్లు.. ఆ వెంటనే చేతులెత్తేసినట్లు.. వెను వెంటనే మళ్లీ ప్రచారంతో.. సమావేశాలతో హోరెత్తించి చివరకు పోలింగ్‌కు మూడు రోజుల ముందు కీలక సమయంలో పూర్తిగా అస్త్ర సన్యాసం చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జిల్లాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉండి మాజీలుగా మారిన నలుగురు.. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వరకు తమ కేడర్‌ను నడిపించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొందరు బీఆర్‌ఎస్ హార్డ్ కోర్ నాయకులు ఇజ్జత్‌కా సవాల్ అంటూ తమ పార్టీ గుర్తుకే ఓటు వేయించుకోగా.. మరి కొందరు ఎవరు ఎవరికైనా ఓటు వేసుకోండి అనేలా సైలెంట్‌గా ఉండిపోయారు. ఇంకొందరు ఓ అడుగు ముందుకేసి కమలం గుర్తుకు ఓటేయాలని ప్రచారం కూడా చేయడం విమర్శలకు తావిస్తోంది.

మాజీల తీరుపై విమర్శల వెల్లువ

లోక్‌సభ ఎన్నికల్లో నలుగురు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు జిల్లాలో ఆ పార్టీ అస్థిత్వాన్ని కోల్పోయేలా చేసిందని సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో వారు పోటీ చేసిన సమయంలో కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరిగినవారు.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం అంటీముట్టనట్లు వ్యవహరించారు. చివరి రోజు ప్రచారంలో ఏ ఒక్కచోట కనిపించలేదు. ఇక పోలింగ్ రోజు తమ వంతుగా వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారే తప్ప వారి పరిధిలోని ఏ ఒక్క మండలాన్ని.. గ్రామాన్ని సందర్శించలేదు.. ఓటింగ్ సరళిని కూడా పరిశీలించలేదు. తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయించేందుకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయలేదు. చాలా వరకు పోలింగ్ బూత్‌లలో కనీసం తమ పార్టీ ఏజెంట్లను సైతం కూర్చోబెట్టకపోవడం వారు ముందుగానే అస్త్ర సన్యాసం చేశారనటానికి అద్దం పడుతోంది. స్థానిక సమరం ముందున్న వేళ ఇలా వ్యవహరించడం కేడర్‌కు ఎలాంటి సంకేతాలిస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐదు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులుగా రంగంలోకి దిగి స్వల్ప మెజార్టీతో ఓటమి చవిచూసిన వారుఅంతలోనేఇంత బలహీన పడటం గతంలో ఎప్పుడూ జరగలేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. అయితే బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు కీలక నేతలు పక్క పార్టీల నేతల దగ్గర డబ్బులు తెచ్చుకుని ఇలా లోపాయికారీగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయోమయంలో హార్డ్ కోర్ కేడర్

లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో బీఆర్‌ఎస్ కీలక నేతలు వ్యవహరించిన తీరు ఆ పార్టీ హార్డ్ కోర్ కేడర్‌ను అయోమయానికి గురిచేంది. ఇలాంటి తరుణంలో త్వరలో జరగనున్న స్థానిక సమరంలో పార్టీ కార్యకర్తలు ఇతర పార్టీల నేతలకు దీటుగా ఎలా బదులిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలతో పార్టీ కార్యకర్తలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతే పార్టీ ముమ్ముందు మరింత బలహీన పడి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే పక్క పార్టీల్లో చేరేందుకు క్యూ కట్టిన బీఆర్‌ఎస్ స్థానిక నాయకులు ఇక ముందు మరింత వలసలు పెరిగేందుకు అవకాశం ఉందని హార్డ్‌కోర్ కేడర్ అంటోంది. పార్టీని బలోపేతం చేయాల్సిన ముఖ్య నేతలే ఇలా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పార్టీ వ్యూహాత్మక ఎత్తుగడా..? లేకా చారిత్రక తప్పిదమా.. అనే చర్చ జరుగుతోంది.

ఇంకెన్నాళ్లు?

జూలో మూగ జీవాల మృత్యువాత

అదే గరళం.. అభిమన్యు దూరం

- కాటేస్తున్న కలుషిత జలాలు
- ఇప్పటికే 'సాక్షి' హెచ్చరికలు
- మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం
- నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటు ఏ'మాయే'?

2015: బద్రీ అనే మగ వైట్ టైగర్ కలుషిత నీరు తాగి గొంతు వాపు వ్యాధితో 14 ఏళ్ల వయసులోనే మృతి చెందింది.

2023: కలుషిత జలాల కారణంగా జో అనే పదేళ్ల వయసున్న మగ రాయల్ బెంగాల్ టైగర్ కిడ్నీ పాడై మృత్యువాత పడింది.

2024: తొమ్మిదేళ్ల క్రితం ఇక్కడి జూలో పుట్టి, పెరిగిన అభిమన్యు అనే బెంగాల్ వైట్ టైగర్ కలుషిత నీటి కారణంగా కిడ్నీ సంబంధింత నెఫ్రైటిస్ వ్యాధితో బాధపడుతూ కన్నుమూసింది.

.. ఇలా ఒక్కొటొక్కటిగా మూగజీవాలు మృత్యువాత పడుతున్నా.. అటు ప్రభుత్వానికి, ఇటు అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్టయినా లేదు. జూలోని కలుషిత జలాలతో వ్యాధుల బారిన పడి మూగజీవాలు కనుమరుగవుతున్నాయి. నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి వీటిని కాపాడాల్సిన సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. ఇంకెన్నాళ్లిలా మూగజీవాల మృత్యుఘంటికలు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. – చార్మినార్

జూ పార్కు మూగ జీవాలకు కష్టమొచ్చింది. మీరాలం చెరువు కలుషిత జలాలు జూ పార్కు జంతువులకు గరళంగా మారాయి. మూగ ప్రాణులు ఒకదాని తర్వాత ఒకటి మృత్యువాత పడుతున్నాయి. కలుషిత నీటి వాడకం ద్వారా జంతువులకు లివర్, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాయి. లివర్ సిర్రోసిస్‌తో పాటు నెఫ్రైటిస్ వ్యాధులతో దీర్ఘకాలిక వైద్య సేవలు పొందు తున్నప్పటికీ.. ఫలితం లేకుండా పోతోంది. ఇక్కడి నేల, నీరు మీరాలం చెరువు నీటితో కలుషితమయ్యాయి. జూ పార్కులో అక్కడక్కడా ఉన్న చిన్న చిన్న కుంటలలోకి మీరాలం నీరు చేరడం.. వీటిని జూ అవసరాలకు వినియోగిస్తున్నారు. జంతువులకు వినియోగించే గడ్డి పంటలను సైతం మీరాలం చెరువుకు చెందిన కలుషిత నీటినే వినియోగిస్తున్నారు. జూలోని వెట్ మోట్‌లలో కూడా ఇవే నీరు వాడుతున్నారు. 24/7 కలుషిత నీటిని వినియోగిస్తుండడంతో జంతువులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

దెబ్బ తింటున్న కాలేయం, కిడ్నీలు..

హెవీ మెటల్స్‌తో పాటు నైట్రేట్, మాలిబిడ్నం జంతువులలోని కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పశు వైద్య నిపుణులు చెబుతున్నారు. మోతాదుకు మించి ఉంటే కాలేయ సంబంధ వ్యాధి అయిన లివర్ సిర్రోసిస్‌తో పాటు మూత్ర పిండాలకు సంబంధించిన నెఫ్రోసిస్ వ్యాధులు వస్తాయంటున్నారు. గత కొన్నేళ్లుగా కలుషిత నీటికి పదుల సంఖ్యలో జంతువులు బలైనట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.



ఎన్‌క్లోజర్‌లో దీనంగా మృగరాజు

పోస్టుమార్టం రిపోర్టులో ఏముంది?

2015 జనవరి 2న జూ పార్కులో జన్మించిన అభిమన్యు అనే మగ వైట్ బెంగాల్ టైగర్ మంగళవారం మరణించగా.. నగరంలోని వీబీఆర్ఐ, సీపీఎస్‌సీలకు చెందిన పశు వైద్య నిపుణులతో పోస్టు మార్టం నిర్వహించారు. క్రానిక్ రీనల్ ఫెయిల్యూర్‌తో నెఫ్రైటిస్ వ్యాధి వచ్చిందని.. దీంతో నడవ లేని స్థితికి చేరుకుని ఆహారం మానేయడంతో మరణించినట్లు స్పష్టం చేశారు. అభిమన్యు గత ఏడాది ఏప్రిల్ 21 నుంచి నెఫ్రైటిస్ వ్యాధితో బాధపడుతూ వైద్య సేవలు పొందుతున్నట్లు జూ వైద్యులు తెలిపారు. కలుషిత నీటి కారణంగానే కిడ్నీలు ఫెల్యూర్ అవుతాయని పశు వైద్య నిపుణులు చెబుతున్నారు.

సమస్యకు పరిష్కార మార్గం ఏమిటి?

జూ పార్కులో కలుషిత జలాల సమస్యకు పరిష్కారానికి నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడమే ఏకైక మార్గమని జూ అధికారులు అంటున్నారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించి పచ్చ గడ్డి పండించే పొలం వద్ద ఒక నీటిశుద్ధి కేంద్రంతో పాటు మరొకటి టైగర్ సఫారీ వద్ద ఏర్పాటు చేయాలని ఇప్పటికే జూ పార్కు అధికారులు ప్రణాళికలు రూపొందించి ప్రభుతానికి నివేదిక రూపంలో అందించారు. మీరాలం నీటిని శుద్ధి చేసి పంపించడానికి సంబంధిత జూ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

'సాక్షి' హెచ్చరించినా..

తాము తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామనే విషయాలను నోరు తెరిచి ఎవరికి చెప్పుకోలేని మూగ జీవాలను సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. గత నెల 23న.. 'జూలో మీరాలం గరళం.. మూగ జీవాల అరణ్య రోదన' శీర్షికన సాక్షి స్పెషల్ స్టోరీని ప్రచురించింది. జూ పార్కులోని జంతువుల దయనీయ స్థితిని ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకొచ్చింది. ఈ క్రమంలో మూగ జీవాలను కాపాడడానికి ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి తగిన కార్యాచరణ రూపొందించి వాటికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి వెంటనే స్పందించి ప్రణాళికలు రూపొందించి తగిన విషయాన్ని విస్మరించడం పట్ల జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కలుషిత నీటితో ఎన్‌క్లోజర్

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


తేజ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లొండ జిల్లా చింతపల్లి మండలం సాయిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన గండేటి తేజ(50) కొన్నేళ్ల క్రితం మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి వలస వచ్చారు. ఆయన తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం బాటసింగారంలోని దొడ్డ శాంతికుమార్ వ్యవసాయ భూమిలో ఉన్న తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సమతుల్య వ్యవసాయంపై రైతులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న రైతులు, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'సమత్యుల వ్యవసాయంలో సాంకేతికత' అనే అంశంపై ఉద్యాన రైతులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వారం పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలేం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ ఎం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. నీటి సాంకేతిక పరిజ్ఞాన సంచాలకులు వారం పాటు ఉద్యాన పంటలపై ఎగుమతి అవకాశాలను రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిసన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కార్యక్రమానికి సహకారం అందించింది. ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం


మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన మద్యం బాటిళ్లను బుధవారం పోలీసులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పట్టుబడిన మద్యం బాటిళ్లను నిర్వీర్యం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ సమీపంలో ఎస్ఐ బాల్‌రాంనాయక్, ఏఎస్ఐ యాదయ్య సమక్షంలో పోలీసు, మున్సిపల్ సిబ్బంది కలిసి మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు.

భౌ భౌలతో.. బెంబేలు!

రోడ్డుపై వెళ్లాలంటే గ్రామ సింహాలతో స్థానికులు భీతిల్లుతున్నారు. శునక సమూహాన్ని చూసి ఎక్కడ వచ్చి పీక్కుతింటాయోనని భయాందోళనకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గొర్రెల మందలపై దాడికి ఉపక్రమించి తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి.

- గ్రామాల్లో వీధికుక్కల స్వైరవిహారం
- చిన్నారులు, వృద్ధులపై దాడులు
- కట్టడి చేయాలంటున్న స్థానికులు


మొయినాబాద్-సురంగల్ రోడ్డులో గ్రామ సింహాలు

మొయినాబాద్: వీధికుక్కలు ప్రస్తుతం గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఒక్కచోట చేరి వాహనదారులను వెంబడిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. పలుచోట్ల గొర్రెల మందలపై దాడి చేసి పశుకాపరులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. చిన్నారులపై సైతం దాడులు చేసి చంపేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు చిలుకూరు, పెద్దమంగళారం, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, సురంగల్, అమ్డాపూర్, శ్రీరాంనగర్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో శునకాలు ఎక్కువయ్యాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే ద్విచక్రవాహనదారుల వెంబడి పడుతున్నాయి. మరోవైపు వీధికుక్కలు గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి జీవాలను చంపేస్తున్నాయి. ఇటీవల కేతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో గొర్రెల మందలపై కుక్కలు దాడి చేసి వందల సంఖ్యలో జీవాల ప్రాణాలు తీశాయి. రోడ్లపై నడుచుకుంటే వేళ్లే వారిపై, చిన్నపిల్లలపై దాడులు చేసి కరుస్తున్నాయి. ఇటీవల తాండూరులో వీధికుక్కల దాడిలో చిన్నారి మృతి చెందిన సంఘటన స్థానికంగా కలవరం సృష్టిస్తోంది. ఇక్కడ సైతం గుంపులు గుంపులుగా ఉండే శునకాలతో అలాంటి దాడులు చేసే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వదులుతున్న వైనం

హైదరాబాద్ నగరం నుంచి వీధికుక్కలు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వదులుతున్నారు. దీంతో ఇటీవలి కాలంలో గ్రామాల్లో శునకాలు ఎక్కువయ్యాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100–200 వరకు గ్రామ సింహాలున్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులతోపాటు, నడుచుకుంటూ వెళ్లేవారు భయంభయంగా వెళ్లాల్సి వస్తుంది. పంచాయతీ అధికారులు గ్రామాల్లో స్వైర విహారం చేసే వీధికుక్కలను పట్టించుకోవడంలేదు. రోజురోజుకు కుక్కల పెరుగుతున్నా వాటిని నియంత్రించే చర్యలు చేపట్టడంలేదు. కుక్కకాటుపై సైతం అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


చిలుకూరులో రోడ్డుపై తిరుగుతున్న వీధికుక్కలు

చెరువు కట్ట ధ్వంసానికి యత్నం

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

కేశంపేట: గతంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెరువుకట్టను ఓ రైతు బుధవారం ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. మండల పరిధిలోని వేములనర్వ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 50లో దత్తాయిపల్లి గ్రామానికి చెందిన రైతు పట్టాదారుగా ఉన్నారు. ఈ సర్వే నంబర్‌లోనే గోప్రోనిగుంట చెరువు ఉంది. వర్షాకాలంలో చెరువులో వర్షం నీరు నిలువ ఉండవద్దనే ఉద్దేశంతో రైతు జేసీబీ, ఇటాచీ, టిప్పర్లను తీసుకువచ్చి కట్టను ధ్వంసం చేసేందుకు యత్నించారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చెరుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదిత వివరాలను సేకరించారు. ఈ మేరకు గ్రామస్తులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. కొద్దిగా చెరువు కట్ట ధ్వంసం అయినట్లు గుర్తించారు. కట్టను పునరుద్ధరించాలని సదరు రైతును ఆదేశించారు. ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది క్లస్టర్ లింగం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన పార్టీ నేతలు


సుధాకర్‌రావును సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని బుధవారం షాద్‌నగర్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య ఆధ్వర్యంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్‌రావు తదితరులు కిషన్‌రెడ్డి స్వగృహంలో పూలబొకేను అందజేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా షాద్‌నగర్‌లో జరిగిన పోలింగ్ తీరును కిషన్‌రెడ్డి నాయకులను అడిగి తెలుసుకున్నారు. చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నికైన మచ్చా సుధాకర్‌రావును శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కూడా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో నాయకులు వెంకటస్వామి, రమేష్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గుర్తింపు లేని కళాశాలల జాబితాను ప్రకటించాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి అఫిలియేషన్ పూర్తి చేయకుండానే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు చేపడుతున్న అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి శృతి ఓజాను సంఘం ప్రతినిధులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని జూనియర్ కళాశాలల జాబితాను ఇంటర్మీడియెట్ బోర్డు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులు అనుమతులు ఉన్న కళాశాలల్లోనే చేరాలని కోరారు. కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు లేని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుని తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

వర్సిటీ వీసీ పోస్టుకు తీవ్ర పోటీ!

- సెర్చ్ కమిటీకి 66 దరఖాస్తులు
- పదవి కోసం పైరవీలు మరూ!

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ పోస్టుకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా దరఖాస్తులు అందిన వర్సిటీల్లో తెలుగు వర్సిటీ ఐదో స్థానంలో ఉంది. కాగా వీసీగా ఇప్పటి వరకు కొన్ని వర్గాల వారికే అవకాశం దక్కుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో అవకాశాలు రాని వర్గాలకు ఈసారి వీసీ పదవి కేటాయిస్తారనే చర్చ సర్వత్రా జరుగుతోంది. రిజర్వేషన్ ప్రాతిపదికన తీసుకున్నా అవకాశాలు దక్కని వర్గాలకే వీసీ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

66 దరఖాస్తులు

వర్సిటీ ప్రస్తుత వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు మూడేళ్ల పదవీకాలం ఈ నెల 21తో ముగియనుంది. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య తంగెడ కిషన్ రావు తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. తెలుగు వర్సిటీని వందెకరాల విస్తీర్ణంలో బాచుపల్లిలో నిర్మించిన సువిశాల ప్రాంగణంలోకి మార్చడంలో అహర్నిశలు కృషి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పది వర్సిటీలకు ఒకేసారి వీసీలు నియమితులయ్యారు. ప్రస్తుతం వీరి పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో వీసీల నియామకాలకు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. త్వరలోనే సెర్చ్ కమిటీ కూడా ఏర్పాటు కానుంది. తెలుగు వర్సిటీ వీసీ పదవికి 66 మంది అర్హులైన ఆచార్యులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా విశ్రాంత ఆచార్యులు ఉన్నారు. ఆచార్యుడిగా పదేళ్ల అనుభవం కలిగిన వారు అర్హులు. వయోపరిమితిలో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అత్యధికంగా దరఖాస్తు చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికి ఈసీ అనుమతితో ఉపాధ్యక్షులను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది.

జోరుగా పైరవీలు

గతంలో వీసీ నియామకాల్లో రాజకీయ ప్రమేయం కీలకంగా ఉండేది. చాలా వరకు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి, సొంత సామాజిక వర్గానికే లభించడం ఆనవాయితీగా వచ్చింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆశావహులు తమదైన శైలిలో పైరవీలు చేయడం ప్రారంభించారు. ఇప్పటికే అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడం మొదలు పెట్టారు. బంధుత్వాలను, డబ్బును ఎరగా చూపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా ఈ సారి వీసీ పోస్టును దక్కించుకోవాలనే ఉత్సాహంతో చాలా మందిలో కనిపిస్తోంది. ప్రభుత్వం కావడం చేత వీసీ నియామకాల్లో గట్టి వడబోత ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇతర వర్సిటీలకు రిజిస్ట్రార్, ఉపాధ్యక్షులు, మాజీ ఉపాధ్యక్షులు పోటీలో ఉన్నారు.

ఓటరు తీర్పు.. నేతల కదిలింపు!

- ఓటర్ల నాడి తెలియక సతమతం
- లోక్‌సభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ భయం
- గెలుపు ధీమాను ప్రదర్శిస్తున్న ప్రధాన పార్టీలు



ఓటు అవగాహన కోసం ఏర్పాటు చేసిన తోరణం వద్ద ఓ వృద్ధుడు (ఫైల్)

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇక నాయకులు ఓటర్ల తీర్పుపై చర్చలు మొదలు పెట్టారు. చేవెళ్ల అసెంబ్లీ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే తంతు. మా నాయకుడు గెలుస్తాడంటే.. లేదు లేదు మాపార్టే విజయం సాధిస్తుందని ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మాత్రం ఈ ఒరవడిలో కాస్త ముందున్నాయి. లోక్‌సభ ఎన్నికలు కావటంతో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని ఆయా పార్టీల నాయకులే చర్చించుకుంటున్నారు. దీంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం జరుగుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలు మద్యం, డబ్బుల పంపిణీ చేయటంతో ఓటర్లు ఎవరికి పట్టం కడుతారని తలలు పట్టుకుంటున్నారు.

కార్యకర్తలనే నమ్ముకున్న పార్టీలు

గతంలో ఎప్పుడు లేనంతగా బీజేపీ ప్రభావం గ్రామీణ స్థాయి వరకు చేరడం ఎన్నికల్లో చర్చనీయాంశమైంది. బీజేపీకి గత కొన్ని ఎన్నికల నుంచి ఓటింగ్ శాతం పెరుగుతూ ఉంది. ఈ ఎన్నికల్లో అది చాలా ఎక్కువగా కనిపించింది. అంతే కాకుండా యువత మొత్తం బీజేపీవైపే ఉందనే ఆలోచన మరింత బలాన్ని చేకూర్చిందని అంటున్నారు. అదేస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కూడా దూసుకుపోయింది. పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి ఉండడం సానుకూల అంశంగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి సైతం చేవెళ్ల స్థానంపై ఫోకస్ పెట్టడంతో కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు పటిష్ట వ్యవస్థ ఉండడంతో గెలుపు తమనే వరిస్తుందనే ధీమాతో నాయకులు ఉన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అన్నట్లుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కానీ లోక్‌సభకు వచ్చే సరికి కారు పార్టీ దూకుడు తగ్గింది.

అసెంబ్లీ పోరులో కారు హవా

అసెంబ్లీ ఎన్నికల వరకు చేవెళ్ల అసెంబ్లీలో బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా చేవెళ్లలో మాత్రం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను గెలిపించారు. అదే జోరు లోక్‌సభ ఎన్నికల్లో కొనసాగుతుందని అనుకున్నారు. కానీ రాష్ట్రంలో పరిణామాలు ఒక్కసారిగా మారాయి. అసెంబ్లీ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు పార్టీని ఖాళీ చేసినట్లుగా అంతా కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్లిపోయారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో పూర్తిగా వెనకబడిపోయింది. దీంతో ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై అభిమానం ఉన్నా దానిని ఉపయోగించుకోవటంలో నాయకులు విఫలమయ్యారు.

'టెట్' హాల్ టికెట్లపై అభ్యర్థుల ఆందోళన

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించే ఉపాధ్యాయ అర్హత రాత పరీక్ష(టెట్)కు సంబంధించి హాల్ టికెట్లపై అభ్యర్థులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కంప్యూటర్ ఆధారిత టెట్ పేపర్-1, పేపర్-2 పరీక్షలకు లక్షలాది మంది అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్నారు. పరీక్షల గడువు సమీపిస్తున్న హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లౌడ్ చేసుకోవాలని సోషల్ మీడియాలో వార్త లొస్తున్నా.. వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదని అభ్యర్థులంటున్నారు. కేవలం నాలుగు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్న.. ఇప్పటి వరకు హాల్ టికెట్లు రాకపోవడంపట్ల ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

తల్లీకూతురు అదృశ్యం.. కేసు నమోదు


రజిత, నక్షత్ర (ఫైల్)

కడ్తాల్: భర్తతో గొడవ పడి ఓ తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన బుధవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లవత్ రజిత, చత్రు భార్యాభర్తలు. వీరు కొంత కాలంగా మండల కేంద్రంలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రజిత భర్తతో గొడవపడి, కూతురు నక్షత్రను తీసుకుని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా లభ్యం కాలేదు. దీంతో బుధవారం చత్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని.. కూలీకి తీవ్ర గాయాలు

కొత్తూరు: కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామ శివారులోని మామిడితోటలో కూలీ పనులు చేస్తున్న కరీమ్(48) పక్కన ఉన్న రోడ్డును దాటే క్రమంలో ఎస్‌బీపల్లి నుంచి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

స్విమ్మింగ్‌పూల్‌లో మృతి చెందిన విద్యార్థి తండ్రి ఫిర్యాదు

మొయినాబాద్: సమ్మర్ క్యాంపులో భాగంగా స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి విద్యార్థి శివశౌర్యన్ మృతికి కారణమైన సుజాత స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల విద్యాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండలంలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూలో ఉన్న సుజాత స్కూల్‌లో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారని.. తమ చిన్న కుమారుడు శివశౌర్యన్‌ను బ్యాడ్మింటన్ కోసం సమ్మర్ క్యాంపులో చేర్పించామని పేర్కొన్నారు. తమకు తెలియకుండానే శివశౌర్యన్‌ను స్విమ్మింగ్‌కు తీసుకెళ్లారు. స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆదేశాలతో కోచ్‌లు చిన్న పిల్లల స్విమ్మింగ్‌పూల్ రిపేర్‌లో ఉండటంతో పెద్దవాళ్ల స్విమ్మింగ్ పూల్‌లో ఈత చేయించారు. ఈత రాని తమ కుమారుడు నీటిలో మునిగి మృతి చెందాడని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా సమ్మర్ క్యాంపు నిర్వహించి తమ కొడుకు మృతికి కారణమైన చంద్రశేఖర్‌తోపాటు స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ప్రమాదాలను మా దృష్టికి తీసుకురావాలి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ రెస్క్యూ టీం ఇన్‌చార్జి సత్యనారాయణ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నవయువయూత్ క్లబ్ సభ్యులు, యువకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడు, గాలి దుమారంతో చెట్లు విరిగినప్పుడు, ఇంట్లో మంటలు చెలరేగినప్పుడు, వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రంగారెడ్డి జిల్లా: మెహిందీ డిజైన్ నేర్చుకోవడానికి వెళుతున్న బాలిక అదృశ్యమైన ఘటన రాచకొండ కమిషనరేట్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాలాపూర్‌లోని షాహిన్ నగర్‌కు చెందిన నజీర్ అహ్మద్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన రెండో కుమార్తె ఉస్మాన్‌నగర్‌లోని ఓ ప్రైవేటు బ్యూటీ పార్లర్ లో మెహిందీ డిజైన్ నేర్చుకుంటోంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన 16 ఏళ్ల సమరిన్ బేగం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు బాలాపూర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో ఉంది.